

మెట్‌పల్లి రూరల్: కేసీఆర్ తండాలో ఏర్పాటు చేసిన గిరిజన ఆదర్శ పోలింగ్ కేంద్రం


రాయికల్: కుమ్మరిపల్లి ఆదర్శ పోలింగ్ కేంద్రం వద్ద అధికారులు



సారంగాపూర్: పెంబట్లలో ఏర్పాటు చేసిన ఆదర్శ మహిళా పోలింగ్ కేంద్రం

# అసెంబ్లీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

■ పోలింగ్ కేంద్రాలకు సామగ్రితో సహా చేరుకున్న అధికారులు.. ■ పోలీసులతో పటిష్ట బందోబస్తు


పెగడపల్లి : పోలింగ్ సామగ్రితో కేంద్రానికి చేరుకున్న అధికారులు

జగిత్యాల, నవంబర్ 29, (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో శాసన సభ ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. జిల్లాలో 785 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. మూడు నియోజకవర్గాలో 6,87,952 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. జిల్లా కేంద్రంలోని వివేకానంద స్టేడియంలో పోలింగ్ సామగ్రిని అందించేందుకు డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయగా, కోరుట్ల, ధర్మపురి నియోజకవర్గాల్లో కూడా డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను ఏర్పాటు చేసి ఎన్నికల సిబ్బందికి సామగ్రిని అందించి పోలింగ్ కేంద్రాలకు తరలించారు. జిల్లా కేంద్రంలోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని కలెక్టర్ యాస్మిన్ బాషా, ఎన్నికల పరిశీలకులు హాజరై పరిశీలించారు. కోరుట్ల నియోజకవర్గంలో 262 పోలింగ్ కేంద్రాలకు గాను 316 మంది పీవోలు, ఏపీవోలు 317, ఓపీవోలు 631, ఎంవో 94, మొత్తం సిబ్బందిని కేటాయించగా, 1286 మంది సిబ్బంది విధులకు హాజరయ్యారు. జగిత్యాల నియోజకవర్గంలో 254 పోలింగ్ కేంద్రాలకు 307 మంది పీవోలు, ఏపీవో 306, ఓపీవోలు 611, ఎంవోలు 59 మొత్తం సిబ్బందిని కేటాయించగా 1220 మంది విధులకు హాజరయ్యారు. ధర్మపురి నియోజకవర్గంలో 269 పోలింగ్ కేంద్రాలకు 326 మంది పీవోలు, ఏపీవోలు 325, ఓపీవోలు 647, ఎంవోలు 81 కేటాయించగా, మొత్తం సిబ్బందిని 1379 కేటాయించగా, 1276 మంది విధులకు హాజరయ్యారు. కాగా కోరుట్ల నియోజకవర్గంలోని 262 పోలింగ్ కేద్రాలకు అన్ని పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలతో పాటు, 187 వెబ్‌కాస్టింగ్‌తో చేస్తున్నారు. జగిత్యాల నియోజకవర్గంలో 254 కేంద్రాల్లో 333 సీసీ కెమెరాలతో 194 కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ చేయడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. ధర్మపురి నియోజకవర్గంలో 269 పోలింగ్ కేంద్రాల్లో 344 కేంద్రాల్లో సీసీ కెమెరాలతో పాటు 165 కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ చేస్తారు. పోలింగ్ సిబ్బందితో పాటు పోలీస్ సిబ్బంది కూడా విధులకు హాజరై గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

**సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో**

సారంగాపూర్, నవంబర్ 29: సారంగాపూర్ మండలంలోని 18 గ్రామాల్లో 23 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా, బీర్‌పూర్ మండలంలోని 15 గ్రామాల్లో 23 పోలింగ్ కేంద్రాలను ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. సారంగాపూర్ మండలంలో 19,859 మంది ఓటర్లు ఉండగా ఇందులో 9,556 మంది పురుషులు, 10,303 మంది మహిళలు ఉన్నారు. బీర్‌పూర్ మండలంలో 16,962 మంది ఓటర్లు ఉండగా ఇందులో 8,118 మంది పురుషులు, 8,844 మంది మహిళలు ఉన్నారు. కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు భారీ భద్రత ఏర్పాట్లు చేస్తున్నట్లు సారంగాపూర్, బీర్‌పూర్ ఎస్‌ఐలు తిరుపతి, గౌతమ్ పేర్కొన్నారు.

రాయికల్, నవంబర్ 29: పట్టణంతోపాటు మండలంలో 48 పోలింగ్ కేంద్రాల్లో 51,284 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకుంటారు. కుమ్మరిపెల్లి గ్రామంలో ఆదర్శ పోలింగ్ కేంద్రం, అయోధ్య గ్రామంలో మహిళా పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ పోలింగ్ కేంద్రాలను పూలు, బెలూన్స్‌తో అందంగా అలంకరించారు.

**కోరుట్లలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్ పరిశీలన**

మెట్‌పల్లి/కోరుట్ల, నవంబర్ 29: పట్టణ శివారు ఎస్‌ఎఫ్ఎస్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను బుధవారం కోరుట్ల నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు రాజీవ్ రంజన్ మీనన్ పరిశీలించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని 262 పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహించే ఎన్నికల సిబ్బంది జాబితాను ఆయన తనిఖీ చేశారు. హాజరైన సిబ్బందికి అందించిన ఎన్నికల సామగ్రిపై ఆరా తీశారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. ఇక్కడ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజేశ్వర్, ఎన్నికల అధికారులు, సిబ్బంది ఉన్నారు.

పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ బూత్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అధికారులు పురాతన గడి గురుజులు, రాతి నగిషీలతో చెక్కిన పురాతన గడి కోనేరును పెయింటింగ్ రూపంలో వేసి పోలింగ్ బూత్‌ను తీర్చిదిద్దారు. ఓటర్లకు స్వాగతం పలికేలా ద్వారాన్ని సుందరంగా అలంకరించారు. దీంతో చూపరులను మోడల్ పోలింగ్ ఆకట్టుకుంది.

**మెట్‌పల్లి మండలంలో**

మెట్‌పల్లి రూరల్, నవంబర్ 29: మండలంలో 36,115 ఓటర్లకు మహిళలు 19,093, పురుషులు 17,021, ఇతరులు ఒకరు ఉన్నారు. వీరు ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎన్నికల అధికారులు 49 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి, సిబ్బందిని ఎన్నికల విధుల్లో నియమించారు. కేసీఆర్ తండాలో గిరిజన ఆదర్శ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సమస్యాత్మక కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. దివ్యాంగుల సౌకర్యార్థం వీల్‌చైర్లు సైతం కేంద్రాలకు చేరుకున్నాయి. పోలీసులు, బీఎస్‌ఎఫ్ జవాన్లతో బందోబస్తు నిర్వహిస్తున్నారు.

**మల్లాపూర్ మండలంలో**

మల్లాపూర్, నవంబర్ 29: మండలకేంద్రంతో పాటు, పలు గ్రామాలో 50 పోలింగ్ బూత్‌లు ఉండగా, ఇందులో పురుషులు 18,734, మహిళలు 21,115 కలిపి 39,849 మంది ఓటర్లు ఉన్నారు. అలాగే ఎన్నికల శాఖ అధికారులు గొర్రెపల్లి గ్రామంలో మోడల్ పోలింగ్ స్టేషన్, ఓబులాపూర్‌లో ప్రత్యేక మహిళా పోలింగ్ స్టేషన్, కొత్తదాంరాజ్‌పల్లిలో ప్రత్యేక యూత్ పోలింగ్‌స్టేషన్లను ఏర్పాటు చేసి మామిడి తోరణాలతో అందంగా అలంకరించారు. మండలవ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ఎస్‌ఐ నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహిస్తున్నారు.

**కోరుట్ల మండలంలో**

కోరుట్ల రూరల్, నవంబర్ 29: మండలంలోని 15 గ్రామాల్లో పోలింగ్ స్టేషన్లను అధికారులు గురువారం ఏర్పాటు చేశారు. కల్లూరు గ్రామంలో మోడల్ పోలింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేయగా ఆయా గ్రామాల్లో పోలింగ్ సిబ్బంది పోలింగ్ స్టేషన్లకు చేరుకొని ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

**ధర్మపురి నియోజకవర్గంలో**

ధర్మపురి, నవంబర్ 29: ధర్మపురి శాసనసభ ఎన్నికలకు సర్వసిద్ధమైంది. ధర్మపురిలోని ప్రభుత్వ జూనియర్ కళాశా ల మైదానంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుం చి బుధవారం నియోజకవర్గంలోని 269 పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది ఈవీఎంలు, ఎన్నికల సామగ్రితో ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సుల్లో చేరుకున్నారు. ధర్మపురి డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి సిబ్బంది బుధవారం ఉదయం నుంచే చేరుకున్నారు. గ్రామాలు, బూతుల వారీగా సిబ్బందికి స్టాళ్లను ఏర్పాటు చేసి ఎన్నికల సామగ్రిని అధికారులు పంపిణీ చే శారు. సిబ్బందికి రిటర్నింగ్ అధికారి దివాకర్ సూచనలు చేశారు. నియోజకవర్గంలో మొత్తం 2,24,591 మంది ఓటర్లుండగా 1,09,963 మంది పురుషులు, 1,14,622 మంది మహిళలున్నారు. ఆరుగురు థర్డ్ జెండర్లున్నారు.

ధర్మపురి నియోజకవర్గంలోని 269 పోలింగ్ స్టేషన్ల పరిధిలో 1076 మంది ఎన్నికల సిబ్బంది విధుల్లో చేరారు. ఇందులో 26 రూట్లకు 26 సెక్టోరియల్ అధికారులు, 67 మంది మైక్రో అబ్జర్వర్లు, 269 పీవోలు, 269 మంది ఏపీవోలు, 269 మంది ఓపీవోలు, 104 మంది మైక్రో టీమ్ సిబ్బందితో పాటు ఇతర సిబ్బంది, మహారాష్ట్ర, మధ్యప్రదే శ్ రాష్ట్రాలకు చెందిన మూడు కంపెనీల బెటాలియన్ పోలీస్ బలగాలు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. 269 పోలిం గ్ కేంద్రాలకు 79 కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా అధికారులు గుర్తించారు. పోలీస్ బలగాల నిఘా పెంచారు.

**పెగడపల్లిలో**

పెగడపల్లి, నవంబర్ 28: మండలంలో గురువారం నిర్వహించే అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలోని 23 గ్రామాలకు 222 నుంచి 269 వరకు వరుస క్రమంలో అధికారులు పోలింగ్‌కు 45 బూత్‌లను ఏర్పాటు చేశారు. మండలంలో మొత్తం 34759 ఓటర్లు ఉండగా, ఇందులో 17845 మహిళా, 16905 పురుష ఓటర్లు ఉన్నారు. ఎన్నికలకు సంబందించి ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు తలెత్తంకుండా ఉండేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. మహిళల కోసం ఈ ఎన్నికల్లో కొత్తగా ఆదర్శ మహిళా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా వాటిని అందంగా ముస్తాబు చేశారు. ఎన్నికల సందర్భంగా మండలంలో 144 సెక్షన్ విధించామని, శాంతియుతంగా జరిగేందుకు మండల ప్రజలు సహకరించాలని ఎస్‌ఐ సతీశ్ కోరారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించాలన్నారు.

## జిల్లాలో 36 మోడల్ పోలింగ్ కేంద్రాలు

**మహిళలు, దివ్యాంగులు, యువత ఓటు వేసే విధంగా చర్యలు**

జగిత్యాల, నవంబర్ 29: జిల్లాలో మహిళలు, దివ్యాంగులు, యువత శాసనసభ ఎన్నికల్లో అధిక శాతం పోలింగ్ నమోదయ్యేలా జిల్లా అధికారులు చర్యలు చేపట్టారు. జిల్లాలో మొత్తం 36 కేంద్రాలు, మహిళా, దివ్యాంగులు, యువతకు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా, మరో ఐదు మోడల్ పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు. జగిత్యాల, ధర్మపురి, కోరుట్ల నియోజకవర్గాల్లో ప్రతి నియోజకవర్గానికి మహిళలకు సంబంధించి ఐదు మోడల్ పోలింగ్ కేంద్రాలను మొత్తం 15 ఏర్పాటు చేశామన్నారు. అలాగే నియోజకవర్గానికి యువత నిర్వహించే ఒక్కో పోలింగ్ కేంద్రంతో పాటు, దివ్యాంగులకు నియోజకవర్గానికి ఒకటి చొప్పున పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

## స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలి

**విధులు పకడ్బందీగా నిర్వర్తించాలి**

**ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్**

జగిత్యాల, నవంబర్ 29: జిల్లాలో స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు పోలీస్ అధికారులు, సిబ్బంది కృషి చేయాలని ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ అన్నారు. ఎన్నికల విధుల్లో భాగంగా జిల్లాకు వచ్చిన పోలీస్ అధికారులు, సిబ్బందితో జిల్లా కేంద్రంలోని బీఎల్ఎన్ ఫంక్షన్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, సార్వత్రిక ఎన్నికల విధులకు వచ్చిన సెంట్రల్ ఆర్మ్‌డ్ ఫోర్స్, వివిధ రాష్ట్రాలకు చెందిన పోలీస్ అధికారులు, సిబ్బందికి రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రాముఖ్యతను వివరిస్తూ, ఎన్నికల విధులు ఏ విధంగా పకడ్బందీగా నిర్వహించాలి..? సిబ్బంది చేయాల్సిన, చేయకూడని విధుల గురించి ఎస్పీ క్షుణ్ణంగా వివరించారు. పోలింగ్ సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాన్ని ఎట్టి పరిస్థితులలోనూ వదిలి వెళ్లరాదన్నారు. ఓటు హక్కును వినియోగించుకోవడానికి వచ్చిన వారితో మర్యాదపూర్వకంగా ఉండాలని, అనవసర విషయాలు చర్చించవద్దన్నారు. పోలింగ్ జరుగుతున్న సమయంలో పోలింగ్ ప్రశాంత వాతావరణానికి భంగం కలిగే ఏ చిన్న సంఘటన ఎదురైనా వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలన్నారు. పోలింగ్ ముగిసిన తర్వాత ఉన్నతాధికారాలు ఆదేశాలు లేనిదే ఎవరూ కూడా తమ విధుల నుంచి వెళ్లరాదన్నారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కా ర్యకలాపాలకు పాల్పడితే చట్టపరంగా కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ఈసీ నియమాలను పక్కగా అమలు చేస్తామన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా, శాంతి భద్రతలకు విఘాతం కలిగే పరిస్థితులు ఏర్పడినా నిర్భయంగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. విధులు నిర్వహించే పోలీసులకు ప్రజలు తమవంతు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్మ్‌డ్ రిజర్వ్ అదనపు ఎస్పీ ఆర్ జనార్దన్ రెడ్డి, డీఎస్పీ వెంకటస్వామి, టౌన్ ఇన్‌స్పెక్టర్ నటేశ్, సీఐలు, ఎస్‌ఐలు, వివిధ జిల్లాలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్